

గాలివాన బీభత్సం

- పెద్దేముల్, బొంరాస్‌పేట మండలాల్లో వడగండ్ల వాన
- పలుచోట్ల రోడ్లపైన పడ్డ చెట్లు, విరిగిన స్తంభాలు
- మైసమ్మగడ్డ తండాలో పిడుగుపడి 20 గొర్రెలు మృతి



తాండూరు ఇందిరాచౌక్ వద్ద కూలిన భద్రేశ్వర బ్రహ్మోత్సవ కమాన్

వికారాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు బలమైన ఈదురు గాలులు బీభత్సం సృష్టించగా, మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పెద్దేముల్, బొంరాస్‌పేట్ మండలాల్లో వడగండ్ల వాన కురువగా, వికారాబాద్, తాండూరు, యాలాల్, పెద్దేముల్‌లో భారీ వర్షం పడింది. బలమైన ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కోట్‌పల్లి, బంట్వారం, ధారూరు మండలాల్లో చెట్లు విరిగి రోడ్లపై పడడంతో రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యాయి. బొంరాస్‌పేట్ మండలం మైసమ్మగడ్డ తండాలో పిడుగు పడి 20 గొర్రెలు మృతి చెందాయి. మోమిన్‌పేటలో హెల్ప్ ఆల్ సొసైటీ అనాథాశ్రమంలో బాక్స్ క్రికెట్ నెట్ మొత్తం నేలకూలి ధ్వంసమైంది. వికారాబాద్ పట్టణంలో బుగ్గకు వెళ్లే రోడ్డులో చెట్లు విరిగి మెయిన్ రోడ్డుపై పడ్డాయి. సల్బత్తాపూర్, ఓగ్లీపూర్ సమీపంలో రోడ్డుపైన చెట్లు విరిగి రోడ్డుపై పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పూడూరు, దోమ మండలాల్లో మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లింది.

తాండూరులో 27.3 మి.మీ వర్షపాతం

రాత్రి 7 గంటల వరకు జిల్లాలో తాండూరులో 27.3 మి.మీ. వర్షం కురువగా, కులకచర్లలో 22.8 మి.మీ., ధారూరులో 16.5 మి.మీ., పరిగిలో 15.0 మి.మీ., కొడంగల్‌లో 11.3 మి.మీ., పూడూరులో 9.5 మి.మీ., దౌల్తాబాద్‌లో 9.3 మి.మీ., బొంరాస్‌పేట్‌లో 6.0 మి.మీ., పెద్దేముల్‌లో 5.3 మి.మీ., బషీరాబాద్‌లో 3.5 మి.మీ. మన్నేగూడలో 3.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.



పెద్దేముల్ మండలం కందనెల్లి శివారులో రాలిన మామిడికాయలు



సాదా బైనామాలకు మోక్షం!

భూ భారతితో మార్గం సుగమం

భూ భారతి చట్టంతో సాదా బైనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. 2014, జూన్ 2 కంటే ముందు తెల్ల కాగితాలపై భూ యాజమాన్య హక్కులను మార్చుకున్న వారు రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకొని చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌లో ఇందుకు వెసులుబాటు ఇవ్వలేదు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతిని తీసుకురావడంతో మరోసారి దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు 4,443 దరఖాస్తులు రాగా, వాటిలో సమస్యలు లేని దరఖాస్తులను ప్రభుత్వ పరిశీలనకు సిద్ధంగా ఉంచిన విషయం తెలిసిందే.

- 90 రోజుల్లోపు రిజిస్ట్రేషన్ పూర్తికి అవకాశం
- నాలుగున్నరేళ్లుగా ఎదురుచూపులు
- ప్రభుత్వ ప్రకటనతో దరఖాస్తుదారుల్లో ఆశలు
- జిల్లా వ్యాప్తంగా 4,443 దరఖాస్తులు



వికారాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ భారతి చట్టం అమలులోకి రావడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాదాబైనామాల దరఖాస్తుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెల్ల కాగితాలపై రాసుకున్న భూక్రయ, విక్రయాలకు చట్టబద్ధత కల్పించి రిజిస్ట్రేషన్లు చేసి పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 అక్టోబర్, నవంబర్ నెలల్లో దరఖాస్తులు స్వీకరించింది. ఇందుకు ఆర్వోఆర్ 1971 చట్టం కింద 2020, సెప్టెంబరు 12 నుంచి అక్టోబరు 10 వరకు దరఖాస్తులు స్వీకరించారు. క్రమబద్ధీకరణ కోసం వచ్చిన సాదాబైనామాల దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. ప్రభుత్వ, అటవీ భూములతో పాటు ఇది వరకు తిరస్కరణకు గురైన సాదాబైనామాల దరఖాస్తులను అధికారులు పక్కన పెట్టారు. సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించే అంశంలో ఉన్న అడ్డంకులను పరిష్కరించడంతో పాటు ధరణి పోర్టల్‌లో ఇందుకు సంబంధించి ప్రత్యేక ఆప్షన్ కల్పించకపోవడంతో సాదాబైనామాల క్రమబద్ధీకరణ, పట్టా పాస్ పుస్తకాల జారీ సాధ్యం కాలేదు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు

మిగతా 6వ పేజీలో...

అత్యధికంగా కులకచర్ల మండలంలో..

సాదా బైనామాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా 4,443 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా కులకచర్ల మండలంలో 505 దరఖాస్తులు రాగా, బంట్వారం మండలంలో అతితక్కువగా 81 దరఖాస్తులు వచ్చాయి. బషీరాబాద్ మండలంలో 181, బొంరాస్‌పేటలో 315, ధారూరులో 203, దోమలో 417, దౌల్తాబాద్‌లో 315, కొడంగల్‌లో 151 దరఖాస్తులు వచ్చాయి. కోట్‌పల్లిలో 139, మర్పల్లిలో 211, మోమిన్‌పేటలో 298, నవాబుపేటలో 136, పరిగిలో 223, పెద్దేముల్‌లో 315, పూడూరులో 136, తాండూరులో 246, వికారాబాద్‌లో 405, యాలాల్‌లో 166 దరఖాస్తులు వచ్చాయి.

విద్యాభివృద్ధికి ఏఐ దోహదం

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

దోమ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యాభివృద్ధికి ఏఐ బోధన దోహదపడుతుందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. దోమ మండలంలోని గుండాల్ ప్రాథమిక పాఠశాలను ఆమె గురువారం సందర్శించి ఏఐ బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధానంతో చదువుపై ఇష్టం పెరిగి విద్యార్థులు తరగతులకు 100 శాతం హాజరు అవుతారన్నారు. అలాగే ఎంఈవో వెంకట్, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం దాదాపూర్‌లో విద్యార్థులకు యూనిఫాం కుట్టే కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే దోమ మండలంలోని ప్రతీ పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు, తాగునీరు, తరగతి గదుల మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని డీఈవో సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో రామ్‌మస్తా, ప్రధానోపాధ్యాయులు అమర్‌నాథ్, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, సీఆర్‌పీ రఘుసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హనుమాన్ ఆలయ చైర్మన్‌గా భీమలింగం

తాండూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని సీతారాంపేట్ హనుమాన్ ఆలయ ట్రస్ట్ బోర్డును నియమిస్తూ దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా డి.భీమలింగం, డైరెక్టర్‌లుగా ఎం.నర్సిములు, బి.మంజుల, బి.నర్సిములు, కె.విశ్వనాథ్‌లను నియమించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా విశ్వనాథం నియమితులయ్యారు. నమ్మకంతో ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆర్పిఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డిలకు బోర్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దేవాలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

'భూ భారతి'తో శాశ్వత పరిష్కారం

పరిగి/పూడూరు, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి-2025 నూతన చట్టం ద్వారా భూ సమస్యల శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పూడూరు మండలం కేంద్రంలో భూభారతి-2025 చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి, పరిగి,తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్వోఆర్ మార్పులు, చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయన్నారు. రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రతకు తావులేకుండా, జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఈ చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతీ దానికి ఫీజులు వసూలు చేసేవారన్నారు. భూ భారతి ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కలెక్టర్ రోజుకు రెండు మండలాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఆగస్టు 15 నాటికి వందశాతం సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో పేదలు తమ అవసరాల కోసం ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టి ఉంటే, వాటికి ఈ చట్టం ద్వారా

మిగతా 6వ పేజీలో...

కొత్తచట్టంతో భూసమస్యలకు చెక్

- పూడూరు అవగాహన సదస్సులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పరిగి తహసీల్దార్ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అదనపు షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వర్నికారెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్



స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డి

మంత్రికి ఘన స్వాగతం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిగి పట్టణానికి మొదటిసారిగా వచ్చిన సందర్భంగా పట్టణంలో అడుగడుగునా స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. క్యాంపు కార్యాలయం వద్ద మంత్రికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి వేర్వేరుగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొంగులేటి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో భోజనం చేశారు.

సాగునీరు అందించడం నా కల

- ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి రైతులకు సాగునీరు అందిచడమే తమ కల అని పేర్కొన్నారు. జిల్లాలోనే పూడూరు మండలంలో ఎక్కువ భూ సమస్యలు ఉన్నాయని, అందుకే ఈ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని గ్రామస్తులు కోరారన్నారు. భూ భారతి ద్వారా కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చి భూ సమస్యల సులభతర పరిష్కారానికి నాంది పలకడం శుభపరిణామని పేర్కొన్నారు.

డిజిటల్ రికార్డులు తప్పనిసరి

- భూ భారతితో అధికారులకు ప్రత్యేక అధికారాలు
- చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు: కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రతీది ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రికార్డులను నిర్వహించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. పూర్తి స్థాయి అధికారాలు వచ్చే వరకు ప్రొసీడింగ్స్ ద్వారా మాన్యువల్‌గా నిర్వహించాలన్నారు. జిల్లాలోని రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణిలో లేని అధికారాలు భూ భారతిలో రెవెన్యూ అధికారులకు ఉన్నాయన్నారు. భూ భారతి చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆధార్ తరహాలో భూమికి సంబంధించి పూర్తి సర్వే చేసి కొలతలు, హద్దుల సమగ్రమైన వివరాలతో భూధార్ తీసుకురానుందన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించారన్నారు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. పెండింగ్‌లోని సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం అవుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా మారుస్తూ మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించారన్నారు. 19వ తేదీ నుంచి జిల్లాలో అవగాహన సదస్సులు ఉంటాయన్నారు. ఈ సదస్సుల ద్వారా భూ భారతి చట్టంపై ప్రజలకు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాశ్, డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు వైద్యపరికరాలను అందజేస్తున్న కెరీర్ ట్రీ ప్రతినిధులు

దాతల సహకారం అభినందనీయం

డీఎంహెచ్‌వో ఉమాగౌరి.. వైద్యపరికరాలు అందజేసిన దాతలు

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగుల వినియోగానికి వైద్య పరికరాలు అందజేసిన దాతల సహకారం అభినందనీయమని జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి అన్నారు. చెన్నైలోని కెరీర్ ట్రీ హెచ్‌ఆర్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ వారు గురువారం జిల్లాలోని పీహెచ్‌సీల్లో వినియోగం కోసం డెలివరీ బెడ్లు, బేబీ వార్మర్లు, బయో కెమిస్ట్రీ ఎనలైజర్లు, సెల్ కౌంటర్ మిషన్‌లు వంటి తదితర వైద్య పరికరాలను కలెక్టరేట్ వద్ద డీఎంహెచ్‌వోకు అందజేశారు. ఈ సందర్భంగా కెరీర్ ట్రీ హెచ్‌ఆర్ సొల్యూషన్స్, యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా బృందానికి డీఎంహెచ్‌వో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి సత్యవతి, సూపరింటెండెంట్ మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి విజేతలకు కన్సోలేషన్ బహుమతులు

'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'కార్ అండ్ బైక్ రేస్' హైదరాబాద్ యూనిట్ డ్రాలో గెలుపొందిన వికారాబాద్ జిల్లా విజేతలకు గురువారం కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. పట్టణంలోని ఆంధ్రజ్యోతి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.సహస్ర(కులకచర్ల), ఎ.హిమబిందు(పరిగి) తరపున ఆమె కుమారుడు తిరుపతి, బి.నరేశ్(తాండూరు) తరపున ఆయన సోదరుడు శ్రీనివాస్ బహుమతులు అందుకున్నారు. వారికి ఆంధ్రజ్యోతి డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి, స్టాఫ్ రిపోర్టర్ ఆర్ఎం.గిరీశ్వర్ స్వామి, ఏసీవో బందయ్య, చేవెళ్ల ఎస్ఆర్ శ్రీనివాస్, యాడ్స్ ఆఫీసర్ మరాఠి శివప్రసాద్‌లు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

-వికారాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



ఎం.సహస్రకు కన్సోలేషన్ బహుమతి అందజేస్తున్న డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ రవి



కన్సోలేషన్ బహుమతి అందుకుంటున్న శ్రీనివాస్, తిరుపతి

అభివృద్ధిలో అధమం



కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సుస్థిరాభివృద్ధి సూచికల్లో కొన్ని పంచాయతీలు కనీస స్థాయి లేక గ్రేడింగ్‌లో చివరి స్థానాల్లో నిలిచాయి. కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ తొమ్మిది అంశాలను పరిగణనలోకి తీసుకొని గ్రామాలకు గ్రేడింగ్‌లను నిర్దేశించింది. మేడ్చల్ జిల్లాలోని నర్సంపల్లి, గోధుమకుంట, కోనాయిపల్లి, లింగాపూర్‌తండా గ్రామాలు అత్యల్ప అభివృద్ధిని సాధించి అధమ స్థానాల్లో నిలిచాయి.

వివరాలు 5లో..

రోడ్డు వెడల్పు కోసం అడవి నరికివేత

● అటవీ శాఖ అధికారుల సీరియస్



షైల్వార్ ఫారెస్ట్‌లో ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న రోడ్డు పనులు



ధ్వంసమైన చెట్లు

బషీరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):రోడ్డు వెడల్పు పనుల కోసం షైల్వార్ రిజర్వ్ ఫారెస్టులో కిలోమీటరు మేర యంత్రాలతో చెట్లను ధ్వంసం చేశారు. దీంతో అటవీశాఖ అధికారులు రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాలాల మండలం జుంటుపల్లి ఆలయ కమాన్ నుంచి బండమీదిపల్లి, పగిడిపల్లి, కొడంగల్ మండలం నాగరం, రుద్రారం మీదుగా బషీరాబాద్ మండలం నీళ్లపల్లి నుంచి షైల్వార్ వరకు డబుల్ రోడ్డు పనులకు రూ.55కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ రోడ్డు వెడల్పు కోసంమూడు రోజుల కిందట రక్షిత అటవీ ప్రాంతలో రోడ్డు పక్కన ఎక్స్‌కవేటర్లతో చదను చేశారు. నీళ్లపల్లి ఏకాంబర ఆలయ కమాన్ సమీపం నుంచి షైల్వార్ రోడ్డు పక్కన అటవీ భూమిలో కందకాలపై పెంచిన నీలగిరి, గచ్చకయ, కానుగ, వేప తదితర చెట్లను తొలగించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సెక్షన్ అధికారి స్నేహశ్రీ, బీట్ అధికారి మల్లప్ప అక్కడికి చేరుకొని రోడ్డు పనులను అడ్డుకున్నారు. అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి యంత్రాలను అక్కడినుంచి పంపించారు. ఈ విషయమై ఫారెస్టు సెక్షన్ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. చెట్ల ధ్వంసం వాస్తవమేనని, దీనిపై తాండూరు రేంజర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఫారెస్టు భూమిలో అనుమతి లేకుండా చెట్లను ధ్వంసం చేసిన వారిపై ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా రిజర్వ్ ఫారెస్టులో కిలోమీటరు మేర సుమారు 150 నుంచి 200 వరకు చిన్న, పెద్ద చెట్లు తొలగించినట్టు తెలుస్తోంది.

నీటిఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవోలు, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్ అధికారులు, మండలాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. అవసరం మేరకు పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. జినుగుర్తిలో శ్రీరాముల వారి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎస్‌డీఎఫ్ పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. భూభారతిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు 60రోజుల పాటు పల్లెబాట ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసిన నాయకులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావును పోచారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకుడు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 20న పోచారంలో జరిగే పోచమ్మ, ఎల్లమ్మ గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మేడ్చల్ మాజీ గ్రంథాలయ చైర్మన్‌భాస్కర్, రమేష్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే హరీశ్‌రావుతో జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు

చీలాపూర్ సర్వేపై నివేదికకు మంత్రి ఆదేశం

● ఆంధ్రజ్యోతి కథనానికి పొంగులేటి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరిగి/పూడూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): "చీలాపూర్‌లో పంట భూముల సర్వే ఎందుకు చేయడం లేదు? ఆ భూముల వివరాలపై నివేదిక ఇవ్వండి." అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ఆదేశించారు. తాను సీసీఎల్ఏ అధికారులతో మాట్లాడి చీలాపూర్‌లో భూముల సర్వే సమస్యను పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'చీలాపూర్‌లో నో సర్వే... 40ఏళ్లుగా కొలతలకు నోచని భూములు' శీర్షికన ప్రచురితమైన కథనంతో మంత్రి స్పందించారు. పరిగి, పూడూరు పర్యటనకొచ్చిన మంత్రికి కథనంలో వచ్చిన అంశాలపై ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, చీలాపూర్ వాసులు వివరించారు. మంత్రి ఆంధ్రజ్యోతి కథనాన్ని పూర్తిగా చదివారు. రెవెన్యూ భూముల సర్వేకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని, భూముల రికార్డులన్నీ ఆన్‌లైన్ చేయించేందుకు ఆదేశిస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

కంకల్‌ను మండల కేంద్రం చేయాలి

● రెవెన్యూ మంత్రి పొంగులేటికి గ్రామస్తుల వినతి



పూడూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కంకల్ గ్రామాన్ని మండల కేంద్రంగా గుర్తించాలని గ్రామస్తులు, రైతులు గురువారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. పూడూరులో భూ భారతి ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామాన్ని మండలం చేసి రైతు రుణమాఫీ, రైతు భరోసా అందని రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులురాజు, సీనియర్ నాయకులు శేఖర్, మనోహర్‌గౌడ్, శివరాజ్, అంజయ్య, నర్సింహులు, నిఖిల్‌తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి

కీసర రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కీసరలోని కూడలిలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు జిల్లాస్పత్రిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

తాండూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వలు లేకపోవడంతో గురువారం జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ధర్మిది రవి శంకర్ చొరవతో ఆస్పత్రి సిబ్బంది ముందుకొచ్చి రక్తదారం చేశారు. ఎవరైనా ప్రమాదానికి గురైనా, పేషెంట్లకు రక్తం అవసరం ఏర్పడితే దాతల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదన్నారు. రక్తనిధి కేంద్ర సిబ్బంది ప్రవీణ్, బీరప్ప, విజయ్, అనంతయ్య, దశరథ్, శివరాథోడ్, రవీందర్, అస్లాం మొయిద్దీన్, అంజప్ప, మంజుల, శ్రీకాంత్, శ్రీనివాస్ రక్తదానం చేశారు.

శరవేగంగా బునాదిగాని కాలువ భూసర్వే



బునాదిగాని కాలువ భూసర్వే చేస్తున్న అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బీబీనగర్‌లోని మక్త అనంతారం నుంచి అడ్డగూడురు వరకు చేపట్టనున్న బునాదిగాని కాలువ భూసర్వే పనుల్లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమగ్నమయ్యారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ రెవెన్యూ పరిధిలో రెండు కిలోమీటర్ల వరకు కాలువ ఉంది. ఇందుకు అధికారులు 30ఎకరాల వరకు భూసేకరణ కోసం సర్వే నిర్వహించారు. కాలువ వెడల్పులో 42మీటర్ల వరకు సర్వే చేపట్టారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా భూసర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ వినయ్ తెలిపారు. ఈ కాలువ వినియోగంలోకొస్తే సాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కావ్యారెడ్డి, ఇరిగేషన్ ఏఈ భరత్‌కుమార్, రైతులు శ్రీశైలంయాదవ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల విధేయతతో ఉండాలి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు రాజ్యాంగం పట్ల విధేయుతతో ఉండాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ మాజీ కార్యనిర్వాహక జడ్జి ప్రకాశ్‌రావు అన్నారు. మండలం పరిధి దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ వర్సిటీలో మూడు రోజుల పాటు ఇక్ఫాయ్ కాన్ఫరెన్స్ ఆఫ్ నేషన్స్(ఐకాన్)-2025 నిర్వహించిన సమ్మిట్ గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ప్రకాశ్‌రావు ముఖ్య అతిథిగా వచ్చారు. అంతర్జాతీయ సహకారం, న్యాయ పరిజ్ఞానం, మానవీయ సిద్ధాంతాలు, మేథో వినిమయం, కుటుంబ త్యాగాలు, శాంతి తదిరాంశాలపై చర్చించారు. రైటర్డ్ జడ్జి మాట్లాడుతూ... విద్యార్థులు ఎల్లవేళలా న్యాయం వైపే ఉండాలన్నారు. మానవీయ విలువలను పెంపొందించుకోవాలన్నారు. ఇక్ఫాయ్ వీసీ గణేశ్, లా స్కూల్ డైరెక్టర్ రవిశేఖరరాజు మాట్లాడుతూ.. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలిగానీ గొడవలకు దిగొద్దని సూచించారు. ఇలాంటి వేదికలు విద్యార్థుల జీవితంలో రాణించేందుకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో రీసెర్చ్ డీన్ ప్రతాప్‌రెడ్డి, అసిస్టెంట్ డీన్ అరుణ్, ఐకాన్-2025 కోఆర్డినేటర్ శ్రీదేవి, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జస్టిస్ ప్రకాశ్‌రావు

వైభవంగా భద్రేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



శూలం గుచ్చుకున్న కళాకారుడు



నృత్యం చేస్తున్న కళాకారులు

తాండూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):చెంపలకు శూలాలు, నడుముకు కొక్కాలతో గుచ్చుకొని నృత్యాలు చేస్తూ భక్తిని చాటుకున్నారు. ఈ దృశ్యాలు బుధవారం రాత్రి తాండూరులో కొనసాగుతున్న భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో కన్పించాయి. మూడు రోజులుగా భద్రేశ్వరస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కర్ణాటక కళాకారులు విన్యాసాలతో ఆకట్టుకుంటున్నారు. ఆలయ రెన్యూవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, కమిటీ సభ్యులు, ఈవో శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పల్లకిలో స్వామి వారి ఉత్సవమూర్తిని ఉంచి మేళాతాళాలు మధ్య ఊరేగించారు. గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. భద్రేశ్వర ఆలయం నుంచి గంజ్ ఏరియా వరకు పల్లకిసేవ కొనసాగింది. కార్యక్రమంలో వీరశైవ సమాజం, యువదళ్, అక్కాదేవి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.


ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్దపీట



ఉపాధి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కడ్తాల సమీపంలోని ఫోర్త్ సిటీ, పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కడ్తాలలో గాన్గుమర్ల తండాకు చెందిన రాజు ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి పథకాన్ని గురువారం డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహతో కలిసి ప్రారంభించారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, సేవాలాల్‌సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతినాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీక్యనాయక్, రామునాయక్, యాదగిరిరెడ్డి, రామకృష్ణ, హన్మ, మోత్య, రాజు, రతన్ పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు చర్యలు : ఎంపీ



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రవి

ఆమనగల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. తమిళనాడు రాజధాని చెన్నైలో జరుగుతున్న పరిశ్రమల స్టాండింగ్ కమిటీ సమావేశానికి గురువారం రవి హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని యంగ్ ఇండియా స్కిల్ స్కిల్ డెవలప్‌మెంట్ కింద పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని స్టాండింగ్ కమిటీ సభ్యులకు ఆయన వినతి పత్రం ఇచ్చారు. లోక్‌సభ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి


దౌల్తాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ అన్నారు. దౌల్తాబాద్‌లో గురువారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పటేల్ విజయ్‌కుమార్, తహసీల్దార్ గాయత్రి, మాజీ ఎంపీటీసీ మంజుల దస్తప్ప, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్ రెడ్డి













అభివృద్ధిలో అధమం..

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అభివృద్ధి సూచీలో కొన్ని పంచాయతీలు కనీస స్థాయిల్లో అయినా వసతులు కల్పించక స్కోరింగ్‌లో చివరి స్థానాల్లో నిలిచాయి. పారిశుధ్యం, పచ్చదనం, మహిళలకు ఆర్థిక తోడ్పాటు, అంగన్‌వాడీ, స్కూళ్ల నిర్వహణ తదితర తొమ్మిది అంశాల్లో ఆ గ్రామాలు కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేదు. మేడ్చల్ జిల్లా నర్సంపల్లి, గోధుమకుంట, కోనాయిపల్లి, లింగాపూర్ తండా గ్రామాలు అత్యల్ప అభివృద్ధిలో అధమ స్థానాల్లో ఉన్నాయి.

సర్పంచ్ ఏకగ్రీవం.. పురోగతి శూన్యం
కనీస వసతులకు నోచని నర్సంపల్లి


గ్రామంలో ఇళ్ల మధ్య పేరుకున్న చెత్త

కీసర, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గతంలో సర్పంచ్ పదవి ఏకగ్రీవమై ఆదర్శంగా నిలిచిన మేడ్చల్ జిల్లా నర్సంపల్లి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. కేంద్ర పంచాయతీరాజ్ అభివృద్ధి సూచిలో 63.51 స్కోరింగ్‌తో గ్రామం జిల్లాలో నాలుగో స్థానంలో ఉంది. కొన్నేళ్ల కిందటి వరకు ఈ గ్రామం యాద్గార్‌పల్లి పంచాయతీలో వీలినంగా ఉండేది. కేసీఆర్ ప్రభుత్వంలో కొత్త పంచాయతీగా ఏర్పడింది. గ్రామస్తులంతా సామల సత్తెమ్మను మొదటి సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అయితే ఆమె గ్రామానికి నిధులు తేవడంలో విఫలమయ్యారు. పంచాయతీకి ఏకగ్రీవ నజరానా కూడా అందలేదు. దీంతో సర్పంచ్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోయారు. గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. గ్రామ ప్రజలకు మౌలిక వసతులు లేవు. మంచినీటి సరఫరా సరిగ్గా నిర్వహించలేదు. హరితహారం, ఎరువు కంపోస్ట్ తయారు చేయలేదు. తడి, పోడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించలేదు. ఆర్థిక వృద్ధిలో మహిళలకు అంతగా ప్రోత్సాహమేదీ పంచాయతీ తరఫున కల్పించలేదు. అంగన్‌వాడీ నిర్వహణా అంతంతే. దేనిలో చూసినా నర్సంపల్లి వెనబడింది. దీనికి తోడు పంచాయతీ కార్యదర్శులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు. వెరసి కేంద్ర ప్రభుత్వ స్కోరింగ్‌లో 63.51శాతంతో జిల్లాలో చివరి నాలుగో స్థానంలో నిలిచింది.

వసతుల్లో లింగాపూర్ తండా

వెలగని వీధి దీపాలు ● నర్సరీలో ఎండిన మొక్కలు

మూడుచింతలపల్లి: మండలంలోని లింగాపూర్‌తండా గురించి పట్టించుకునే వారు లేరు. గ్రామ అభివృద్ధి లేదు. లింగాపూర్ తండాను మాజీ సీఎం కేసీఆర్ దత్తత తీసుకొని పంచాయితీగా ఏర్పాటు చేశారు. నిధులు మంజూరు చేసినా అభివృద్ధి పెద్దగా జరగలేదు. తండా జనాభా తక్కువే ఉంది. డెవెలప్‌మెంట్ ఇండెక్స్‌లో 60శాతం స్కోర్ సాధించి చివరన నిలిచింది.

రాత్రిపూట అంధకారమే ...

లింగాపూర్ తండాలో వీధి దీపాలు వెలగవు. రాత్రి అంధకారం నెలకొంటోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా నిధుల్లేవని పట్టించుకోవడం లేదని తండా వాసులు చెబుతున్నారు. ఎవరికైనా జబ్బుచేస్తే మూడుచింతలపల్లికి వెళ్లి చూపించుకోవాలి. ప్రైవేట్ మందుల దుకాణం కూడా లేదు. తండాలోని నర్సరీలో మొక్కలు పెంచలేదు. ఉన్న కొద్దిపాటి మొక్కలకూ నీరుపోయక ఎండిపోయాయి.


లింగాపూర్‌తండా నర్సరీలో మొక్కలు లేని నర్సరీ

ఈ గ్రామంలో హరితహారం నామమాత్రగా అయినా అమలుకాలేదు. ఎక్కడా కొత్తగా నాటిన మొక్కలు పెరిగిన దాఖలాల్లేవు.



సమన్వయ లోపం... ఊరుకి శాపం

» ప్రగతిలో గోధుమకుంట

వెనకడుగు

కీసర, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పాలకులు, అధికారుల మధ్య సమన్వయం లేక ఆ ఊరు అభివృద్ధిలో కుంటుపడింది. కేంద్ర ప్రభుత్వం 2022-23లో కేంద్ర పంచాయతీ రాజ్ సుపరిపాలన తొమ్మిది అంశాల్లో పురోగతి లేనదని మేడ్చల్ జిల్లా గోధుమకుంటకు అధమ స్థానాన్ని ఇచ్చింది. బాగా అభివృద్ధి సాధించిన గ్రామాలకు ఉత్తమ స్కోరింగ్ ఇచ్చిన కేంద్రం సాధించని గ్రామాలకు కూడా ఆయా అధమ స్కోర్ ఇచ్చింది. గోధుమకుంట అభివృద్ధికి నోచుకోక జిల్లాలో 63.03 స్కోరింగ్‌తో మూడో స్థానంలో ఉంది. మాజీ సర్పంచ్ ఒకటి తలిస్తే, అక్కడి పంచాయతీ కార్యదర్శులు మరో పనిచేయడం. వారి మధ్య గొడవలు ఇలా పలు కారణాలతో గ్రామంలో పనులు పడకేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమల్లో విఫలమయ్యారు. పారిశుధ్యం, చెత్త సేకరణపై అవగాహన కల్పించలేదు. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. చెత్త సేకరణ కేంద్రంలో రెండు కుండీలు కట్టి వాటికి తడి చెత్త అని రాశారు. నిజానికి ఒకటి తడిచెత్త, మరోటి పొడిచెత్త అని రాయాలి. అధికారులు, పర్యవేక్షుల నిర్లక్ష్యానికి ఇదే తార్కాణం. గత పాలకులకు అక్రమ అనుమతులు, అక్రమ వెంచర్లపై ఉన్న శ్రద్ధ గ్రామాభివృద్ధి లేదు. దీంతో గోధుమకుంట చెత్త స్కోరింగ్ మూటగట్టుకుంది.



రెండు కుండీలకు తడి చెత్త అని రాశారిలా..

అస్తవ్యస్తంగా కోనాయిపల్లి

» కొత్త పంచాయతీలో వసతుల లేమి



కోనాయిపల్లి పంచాయతీ కార్యాలయం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హామ్లెట్ గ్రామం నుంచి స్వతంత్ర పంచాయతీగా మారినా గ్రామ అభివృద్ధి మాత్రం శూన్యమే. సర్పంచ్, ఎంపీటీసీ పదవీకాలాన్ని పూర్తిచేసుకున్నారు తప్ప గ్రామం చెప్పుకోదగ్గ వృద్ధి సాధించలేదు. అభివృద్ధిలో చిట్టచివరి జాబితాలో మేడ్చల్ మండలం కోనాయిపల్లి చేరింది. గతంలో నూతన్‌కల్‌కు అనుబంధంగా ఉన్న కోనాయిపల్లి 2019లో సొంత పంచాయతీగా ఏర్పడింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 406మంది జనాభా, 356 మంది ఓటర్లు, ఆరు వార్డులు ఉన్నాయి. నూతన్‌కల్‌కు అనుబంధంగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధితో పోలిస్తే ప్రత్యేక పంచాయతీగా సాధించిందేమీ లేదని గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. ఐదేళ్లలో ఈ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట లేదు. గతంలో నిర్మించిన డ్వాక్రా భవనం, పాఠశాల తప్ప ఎలాంటి పనులు చేపట్ట లేదు. 2023లో రూ.30లక్షలతో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించాలని నిధులు మంజూరు చేసినా పనులు చేయలేదు. గ్రామానికున్న 30పీట్ల రోడ్డు కంకర తేలి గుంతలమయమైంది. గ్రామంలో అధికారుల పాలనలో సమస్యలు తాండవిస్తున్నాయి. సమస్యలపై పట్టించుకునే నాథుడు కరువయ్యాడని గ్రామస్తులు వాపోతున్నారు. నల్లా నీరు రావడం లేదని, ఇళ్లలో జమయ్యే చెత్త సేకరించే వారు లేదని, మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదని స్థానికులు అంటున్నారు. గ్రామంలో సమస్యను పట్టించుకునే వాడు లేడు. దోమలతో వేగలేకపోతున్నాం. నీళ్లు కూడా సరిగా వొస్తలేవు అని వృద్ధురాళ్లు పోశమ్మ, యాదమ్మ ఆవేదనను వ్యక్తం చేశారు.


గుంతలమయంగా రోడ్డు

వసతులకు నోచుకోని అద్రాస్‌పల్లి

● వేధిస్తున్న పారిశుధ్య లోపం

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్రాస్‌పల్లి గ్రామం అభివృద్ధితో వెనక వరసలో ఉంది. గ్రామంలో సరైన డ్రైనైజీ వ్యవస్థ లేక మురుగునీటి పారకంతో దోమల స్వైర విహారం చేస్తున్నాయి. దోమకాటుతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. పారిశుధ్యంపై ఎవరూ దృష్టిపెట్టడం లేదు. రోడ్లపై చెత్త పేరుకుంది. అద్రాస్‌పల్లిలో 1,900మంది జనాభా ఉంది. 1,820 మంది ఓటర్లు ఉన్నారు. పంచాయతీ పనితీరు సరిగ్గా లేక కేంద్ర సర్వేలో 62శాతం స్కోర్‌తో చివరి వరసలో నిలిచింది. అద్రాస్‌పల్లి, ఎల్లగూడ ప్రజలు వ్యవసాయంపై ఆధారపడ్డారు. ఎక్కువగా కూరగాయల సాగుచేస్తూ హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. గ్రామ రోడ్లు సరిగ్గా లేక ధాన్యం, కూరగాయల రవాణాకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మంత్రి మల్లారెడ్డి ఎల్లగూడలో సీసీ రోడ్లకు, అద్రాస్‌పల్లి పంచాయతీ నిర్మాణానికి భూమి పూజ చేసి వదిలేశారు. మహిళా సంఘం భవనాన్నే పంచాయతీగా వినియోగిస్తున్నారు. అభివృద్ధి పనులకు నిధుల్లేక ఎక్కడి సమస్యలక్కడే ఉన్నాయి. గ్రామంలో సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


శిథిలావస్థలో అద్రాస్‌పల్లి పంచాయతీ కార్యాలయం


రోడ్డు పక్కన పారబోసిన చెత్త


అంగన్‌వాడీ సెంటర్ పరిసరాలను పరిశీలిస్తున్న రాధికాగుప్తా

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

శామీర్‌పేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, అలాగే క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఉదయం శామీర్‌పేట గ్రామంలోని 1వ, 4వ రెండు అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. శిథిలావస్థ లో ఉన్న 4వ అంగన్‌వాడీ కేంద్రం భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న పప్పు, పాలు, గుడ్లు పౌష్టికాహారాన్ని పరిశీలించారు. క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులను నేర్పించాలని టీచర్లకు సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించి గదులను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మున్సిపల్ ఇంజనీర్ సునీత తదితరులు ఉన్నారు.

మత విద్వేషాలను రేపుతున్న బీజేపీ


జై సంవిధాన్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అహింసాయుతంగా స్వాతంత్ర్య పోరాటం చేసి విజయం సాధించిన దేశంలో నేడు బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతోందని పీసీసీ ప్రచార కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. గురువారం ముచ్చర్ల, ఉట్లపల్లి, వావిళ్లకుంట తండా, బ్యాగరికంచ గ్రామాల్లో నిర్వహించిన జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని, పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌గౌడ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బి.ప్రశాంత్‌కుమార్, సురేందర్, యుగేందర్‌గౌడ్,సులేమాన్, అంజు, పాండు, నర్సింహ, జగన్, బి.పాండురంగారెడ్డి, అబ్దుల్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

● సబ్‌స్టేషన్ వద్ద మృతుడి కుటుంబీకుల ధర్నా


అశోక్‌రెడ్డి(ఫైల్)

చౌదరిగూడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్లలో ఓ రైతు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండలం మోదళ్లగూడ వాసి అశోక్‌రెడ్డి(35).. చిన్న ఎల్కిచర్లలో పొలం కౌలుకు సాగుచేస్తున్నాడు. ఆయన భార్య అక్షయ, ఇద్దరు కుమారులతో పర్వతాపూర్‌లో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం పొలం వద్ద విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇదే విషయం ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్, లైన్‌మన్ చిన్నరెడ్డిలకు చెప్పినా పట్టించుకోలేదు. వైర్లు, స్తంభాలను పక్కన వేసే ప్రయత్నంలో షాక్‌తో అశోక్‌రెడ్డి చనిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహంతో సబ్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. షాద్‌నగర్ ఇన్‌చార్జీ ఏసీపీ హుస్సేన్‌నాయుడు, రూరల్ సీఐ నర్సయ్య, ఎస్‌ఐ రవీందర్ నాయక్, చౌదరిగూడ ఎస్‌ఐ విజయ్.. చేరుకొని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే అశోక్‌రెడ్డి చనిపోయాడని ఆయన కుటుంబీలన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఈ విషయమై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చెక్కుల పంపిణీలో రసాభాస

» కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు మంజూరు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గురువారం కందుకూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మధ్య వాగ్వాదంతో రసాభాసగా మారింది. ఎమ్మెల్యే సబితారెడ్డి కలుగజేసుకోవడంతో ఇరువర్గాలు శాంతించాయి. మండల పరిషత్‌లో తహసీల్దార్ కె.గోపాల్ ఆధ్వర్యంలో 105మందికి చెక్కుల పంపిణీ ప్రారంభించారు. మొదట ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం కల్యాణలక్ష్మి కింద లక్ష రూపాయలు, తులం బంగారం ఇవ్వాలని, రైతులకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయాలన్నారు. పరిశ్రమలకు ఇప్పటికే సేకరించిన 14వేల ఎకరాలుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం తిమ్మాపురం, తిమ్మాయిపల్లిల్లో మరో 3వేల ఎకరాలను సేకరించడం ఏమిటని సబిత ప్రశ్నించారు. దీంతో ఏఎంసీ డైరెక్టర్ అండెకార్ సురేందర్ లేచి.. బీఆర్ఎస్ హామీ ఇచ్చినట్టు పేద దళితులందరికీ 3ఎకరాలు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులంతా లేచి ఎమ్మెల్యే మాట్లాడుతుండగా మీరెందుకు మాట్లాడుతారని ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య కొద్దిసేపు తోపులాట, వాగ్వాదం జరిగాయి. దీంతో ఎమ్మెల్యే వేదిక నుంచి కిందికి దిగి బీఆర్ఎస్ నాయకులను బయటకు పంపించారు. కాంగ్రెస్ నాయకులు సైతం బయటకు వెళ్లారు. అనంతరం చెక్కుల పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు ప్రొటోకాల్ పాటిస్తే గందరగోళం ఉండదని అధికారులన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, ఎంపీడీవో సరిత, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, ఆనంద్, పాండు, యుగేందర్‌గౌడ్, డీటీ శేఖర్, ఆర్ఐలు యాదగిరి, శ్రీకాంత్, నాయకులు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దశరథ్, ఇందిరదేవేందర్, రామక్రిష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, తిరపతయ్య, ప్రకాశ్‌రెడ్డి, కార్తీక్, వెంకటేష్, శేఖర్, దామోదర్‌గౌడ్ పాల్గొన్నారు.


నానక్‌నగర్‌లో ఫెన్సింగ్ రాడ్లను పాతుతున్న కూలీలు

జోరుగా సర్వే, ఫెన్సింగ్ పనులు

యాచారం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఫార్మాసిటీకి సేకరించిన భూములకు హద్దుల గుర్తింపు, ఫెన్సింగ్ కోసం ఇనుప రాడ్లు పాతే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. గురువారం వరకు 25కిలోమీటర్ల వరకు సర్వే చేశారు. మొత్తం 125 కిలోమీటర్ల సర్వే హద్దులు పాతాల్సి ఉందని టీజీఐఐసీ అధికారులు తెలిపారు. తాటిపర్తిలో నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తామని, ఆందోళన చెందొద్దని అన్నారు. తాటిపర్తి బంధం చెరువు, కుర్మిద్ద పెద్దచెరువులోకి రాకపోకలకు రోడ్డు దారి వదలాలని రైతులు, మత్స్యకారులు అధికారులను కోరారు. ఫార్మాసిటీ భూములకు ఫెన్సింగ్ వేసేందుకు తమకు అభ్యంతరం లేదన్నారు. హద్దు పనులను రాచకొండ మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు, తహసీల్దార్ అయ్యప్ప పర్యవేక్షిస్తున్నారు.

సకాలంలో చికిత్స అందించాలి

» డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హిమోఫిలియా వ్యాధి ఒక జన్యు సంబంధమైనదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ పేర్కొన్నారు. గురువారం కొత్తగడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమోఫిలియా జబ్బు ఉన్న వారిలో రక్తం గడ్డకట్టే స్వభావం తక్కువగా ఉంటుందన్నారు. హిమోఫెలియా కేసులను గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే ప్రస్తుత వేసవి కాలంలో వడదెబ్బ, ఎండ తీవ్రతల నుంచి రక్షణ గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిరోషా, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి బుచ్చిబాబు, కొత్తగడి వైద్యాధికారి కృపాలత, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, మహేష్ రేణుకుమార్, జయరాముడు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లిలో గాలివానకు నేల కూలిన బొప్పాయి తోటను, రాలిన మామిడికాయలను గురువారం విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. మామిడి రైతు శ్రీనివాస్‌గౌడ్, బొప్పాయి రైతు జంగయ్యలను పరామర్శించారు. నష్టపోయిన పంటలను యంత్రాంగం వెంటనే పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఫసల్ బీమాను అమలు చేస్తే ఇలాంటి వైపరీత్యాల్లో బీమా కంపెనీలే రైతులకు పరిహారం చెల్లించేవన్నారు. రాష్ట్రంలో ఫసల్ బీమా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేయాలని విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యాన వన అధికారికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, గణేశ్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, భాను, మహేందర్‌రెడ్డి, కె.నరేందర్‌రెడ్డి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.


ధ్వంసమైన బొప్పాయి తోటను పరిశీలిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఐస్‌క్రీం బాగలేదని దాడి

దుకాణ యజమానులపై అన్నదమ్ముల దాష్టీకం ● కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఐస్‌క్రీంలు బాగాలేవని ఓ దుకాణదారుడిపై, అతడి భార్యపై దాడి ఘటనలో ఇద్దరు అన్నదమ్ములపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన పప్పూరామ్ కుమావత్, అతడి భార్య శైలు పిల్లలతో కలిసి అవుశాపూర్‌లో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం అవుశాపూర్‌నకు చెందిన మచ్చ రాజశేఖర్.. కిరాణ దుకాణానికి వెళ్లి రూ.20 ఇచ్చి రెండు ఐస్‌క్రీంలు తీసుకున్నారు. గంట తరువాత వచ్చి రెండు ఐస్‌క్రీంలు కరిగిపోయాయని, నాసికరం ఐస్‌క్రీంలు ఇచ్చారని గొడవపడి వెళ్లిపోయారు. సాయంత్రం మరోసారి రాజశేఖర్, సోదరుడు విశాల్‌తో షాపునకు వొచ్చి పప్పూరామ్, శైలులపై దాడి చేశాడన్నారు. పప్పూరామ్ కూతురికి గాయాలు కాగా, దుకాణంలోని సామగ్రి ధ్వంసమైందన్నారు. శైలు ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.


మచ్చ రాజశేఖర్, విశాల్

హైవేపై పడిన మర్రివృక్షం

చేవెళ్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం గాలితో వర్షం పడింది. అయితే భారీ గాలికి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన మిర్జాగూడ-ఖానాపూర్ గేట్‌ల మధ్య ఉన్న మర్రిచెట్టు రోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ముప్పు తప్పింది. వాహనదారులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో మర్రిచెట్టును తొలగించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

తలకొండపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గట్టిప్పలపల్లిలో గురువారం మాట్లాడుతూ.. గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్కదాన్నీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు రాజు, జంగయ్య, కృష్ణయ్య, రవీందర్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.


వికారాబాద్: రోడ్లపై నిలిచిన వర్షపునీరు


తాండూరు రూరల్: ఈదురుగాలులకు కుప్పకూలిన ఫ్లెక్సీలు



కోట్‌పల్లి: ఒగ్లపూర్‌లో నేలకొరిగిన చెట్టు, అన్నసాగర్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఈదురు గాలులు.. భారీ వర్షం

తాండూరు: నంబర్ 1 స్కూల్ వద్ద మురుగు కాల్వలు నిండి నిలిచిన వర్షపు నీరు




మోమిన్‌పేట్: ఈదురుగాలులకు నేలకొరిగిన క్రికెట్ నెట్


దోమ: మండలంలో కురుస్తున్న వర్షం

వికారాబాద్ జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు నిప్పులు చెరిగే ఎండతో అల్లాడిన జనం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలు సాగించేందుకు జనాలు ఇబ్బంది పడ్డారు. ఈదురుగాలులకు పలు చోట్ల విద్యుత్‌స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. అకాల వర్షానికి చేతికొచ్చిన పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు చోట్ల వడగళ్ల వాన కురిసింది. దీంతో మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. రాత్రి సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడి జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


దోమ: ఈదురుగాలులకు నేలరాలిన మామిడి

బొంరాస్‌పేట్: బురితండా పంచాయతీ పరిధిలోని మైసమ్మగడ్డ తండాలో పిడుగు పడి మృత్యువాతపడిన 20గొర్రెలు




ధారూరు: కురుస్తున్న భారీ వర్షం


తాండూరు రూరల్: అంతారంలో విరిగిపడిన చెట్టు

'భూ భారతి'తో శాశ్వత పరిష్కారం

(మూడో పేజీ తరువాయి)

విచారణ జరిపించి పట్టాలు ఇస్తామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని, ఆనాడు ఇందిరమ్మ ఇచ్చిన భూములను ధరణి ముసుగులో గుంజుకున్నారని ఆరోపించారు. కొత్త చట్టం ద్వారా అట్టి భూములను తిరిగి అప్పగిస్తామన్నారు.

'ధరణి'తో విభేదాలు: స్పీకర్

తల్లితో బిడ్డది బంధం అయితే, భూమితో రైతుది అనుబంధమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ పెద్దలు భూమితో రైతుకు ఉన్న అనుబంధాన్నిదూరం చేయడానికే ధరణిని తీసుకొచ్చారని విమర్శించారు. కుటుంబాల మధ్య, అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టి విభేదాలు సృష్టించి గొడవలు జరిగేలా చేశారని విమర్శించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా భూముల రెట్లు రూ.కోట్ల ఉన్నాయని, అమాయకులైన రైతులు


సదస్సులో మాట్లాడుతున్న మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

మోసపోకుండా భూ భారతి అండగా ఉంటుందన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు ఈ చట్టం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. పైరవీలకు అస్కారం లేకుండా, అన్ని రకాల అప్షన్‌లు ఉన్నాయన్నారు. పూడూరు మండలం దామగుండంలోనే నేవీ రాడార్ స్టేషన్‌ను ఏర్పాటుకు గత ప్రభుత్వం కేంద్రం నుంచి పరిహారం తీసుకుని మాట మార్చితే, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని దేశ రక్షణ,ప్రాధాన్యతను గుర్తించి శంకుస్థాపన చేయించారని గుర్తు చేశారు. చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం దేశంలోని ఆదర్శం కానుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, కలెక్టర్ లింగ్యానాయక్; ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్పీ ఎన్.శ్రీనివాస్, తహసీల్దార్లు భరత్, ఆనంద్‌రావు, లక్ష్మీనారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు

పరిగి తహసీల్దార్ కార్యాలయ కొత్త భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన అదనపు షెడ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. వంద ఏళ్ల క్రితం నిర్మించిన కార్యాలయం కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మంత్రి పొంగులేటిని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి కార్యాలయ నిర్మాణానికి అవసరమైన నిధులైన ఇస్తానని హామీ ఇచ్చి, ముందుగా రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనులు కూడా ప్రారంభించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు .కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కష్టపడి చదివితేనే భవిష్యత్తు


విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 17: విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోగలరని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శ్రీ చైతన్య తాండూరు బ్రాంచ్ విద్యార్థులు నాసాకు దక్ష్ అనే ప్రాజెక్టును తయారు చేసి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం పొందిన సందర్భంగా విద్యార్థులను ఎంపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం వెంకట్, స్టేట్ కోఆర్డినేటర్ సురేష్, జోనల్ కోఆర్డినేటర్ వీర స్వామి, తులసి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి సన్మానం

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూభారతి పోర్టల్ ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం కొడంగల్ నియోజకవర్గానికి వస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. తుంకిమెట్ల చౌరస్తాలో గురువారం ఆహ్వానం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వారితో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అన్నారు. అదేవిధంగా పారిశుధ్యంపై చర్చించారు. గ్రామాల్లోని పాఠశాల భవనాలను కార్యదర్శులు సందర్శించాలన్నారు. ఈ సమావేశంలో డీఈ రత్నప్రసాద్, ఎంఈవో మల్లేశం, పీఆర్ ఏఈ యాదగిరి, ఎంపీవో శంకరయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లించాలి

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదని గురువారం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు శామీర్‌పేట్, మూడుచింతలపల్లి గ్రామంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు.

దేశ వారసత్వ సంపదను కాపాడుకోవాలి

కీసర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశ వారసత్వ సంపద అయిన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ కూమార్ అన్నారు. నాగారం మున్సిపల్ పరిధి, రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్‌లో ప్రపంచ వారసత్వ సంపద దినోత్సవం వేడుకలు (గురువారం) ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దేవనూరు జీహెచ్‌ఎం ఉద్యోగ విరమణ

యాలాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం మాధురి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ నాయకులు పలువురు మాధురిని ఘనంగా సన్మానించారు.

సాదా బైనామాలకు మోక్షం!

(మూడో పేజీ తరువాయి)

చట్టబద్ధత కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోలేకపోయింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది.

మొదట నోటీసులు జారీ

కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకు రావడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రైతులు, భూయజమానుల హక్కుల రక్షణ, భద్రతతో పాటు పలు సేవలు అందించే విధంగా ఈ భూభారతి నూతన చట్టాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్తచట్టంతో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల్లో క్రమబద్ధీకరణకు అర్హత కలిగిన వాటికి చట్టబద్ధత కల్పించేందుకు మార్గం సుగమం కానుంది. ఆర్డీవో స్థాయిలో విచారణ నిర్వహించి క్రమబద్ధీరణ ప్రక్రియ చేపట్టనున్నారు. మొదట విచారణకు హాజరు కావాలంటూ దరఖాస్తుదారులకు ఆర్డీవో నోటీసులు జారీ చేస్తారు. ఇందుకు దరఖాస్తుదారులు అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుంది. ఆర్డీవో క్షేత్రస్థాయి విచారణ జరిపించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు. దరఖాస్తు చేసుకున్న భూమి సీలింగ్, అసైన్డ్, షెడ్యూల్డ్ ఏరియా చట్టాల పరిధిలోకి రానిదిగా ఉండాలి. అనంతరం భూ భారతి చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ ప్రక్రియ అంతా దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసిన 90 రోజుల్లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఐదెకరాల్లోపు ఉచితంగానే..

సాదాబైనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి నాలుగున్నరేళ్ల ఎదురు చూపులు తప్పలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్లు, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాదిన్నర కాలంగా ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారిగా 2016లో సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపట్టింది. అయిదెకరాల లోపు వ్యవసాయ భూములకు ఉచితంగా పట్టామార్పిడి చేశారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు తీసుకోలేదు. అయితే అయిదెకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూములకు మాత్రం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుని క్రమబద్ధీకరించి పట్టా మార్పిడి చేశారు. కాగా, కొత్తగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకు రావడంతో సాదాబైనామాలకు క్రమబద్ధీకరించేందుకు మార్గం సుగమమైంది. ఇంత వరకు భూ క్రయవిక్రయాలకు సంబంధించి తెల్ల కాగితంపై రాసుకున్న సాదాబైనామాలపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఎవరి నుంచి అభ్యంతరాలు రాకపోతే క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టేవారు. పట్టాదారు కుటుంబ సభ్యులు ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే పొలం సరిహద్దుల్లో ఉండే రైతుల వాంగ్మూలం నమోదు చేసుకుని ఫారం-8 నోటీసులు జారీ చేసి సంబంధిత గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో ప్రదర్శించేవారు. ఎవరి నుంచైనా అభ్యంతరాలు వస్తే వాటిపై సమగ్ర విచారణ జరిపించి నిబంధనల మేరకు అర్హులకు పట్టా జారీ చేసేవారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

శామీర్‌పేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ రోడ్డుప్రమాదాలను నివారించాలని మేడ్చల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. తూంకుంటలోని విశ్వవిశ్వాని కళాశాల క్యాంపస్‌లో గురువారం మేడ్చల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, విశ్వవిశ్వాని కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రహదారి భద్రత అవగాహన ప్రచారాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మేడ్చల్ ట్రాఫిక్ డివిజన్ ఆధ్వర్యంలో ప్రజల్లో ఆసక్తి కలిగించే విధంగా ఫ్లాష్‌మాబ్స్, స్క్రిప్టులు, బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌లు డాక్టర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

మూడుచింతలపల్లి: మండలంలోని జగ్గంగూడలో గురువారం ట్రాఫిక్ ఎస్‌ఐ నవీన్‌రెడ్డి విశ్వవిశ్వాని కళాశాల విద్యార్థులతో రోడ్డు భద్రతపై ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మోమిన్‌పేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరంపల్లిలో సంగారెడ్డి క్లియర్ విజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 87 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి , వైద్యులు పుష్పరాజు, విట్టల్, సంతోష్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలను కాపాడాలి

దోమ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దాదాపూర్‌లో కబ్జాకు గురైన శ్మశానవాటికలను కాపాడాలని గ్రామస్థులు కోరారు. మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులుకు గురువారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ నర్సింహులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

టీఎల్‌ఎం మేళాతో విద్యార్థుల్లో నైపుణ్యం

కులకచర్ల: టీఎల్‌ఎం మేళాతో విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతి సందర్భంగా గురువారం కులకచర్ల మండలంలోని ఘనపూర్ ప్రాథమిక పాఠశాలలో బోధనోపకరణాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో హబీబ్ అహ్మద్, గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బొంరాస్‌పేట్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశానుసారం బొంరాస్‌పేట్ మండలంలోని బాపల్లితండాలో గురువారం సీత్యానాయక్ తండాకు చెందిన కేతావత్ శంకర్‌నాయక్‌కు రూ.27వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మాజీ సర్పంచ్ మోత్యానాయక్ అందజేశారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

బషీరాబాద్: మండలంలోని నవాల్గ ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. స్థానిక మాజీ సర్పంచ్ డి.నర్సింహులు స్మారకార్థం ఆయన భార్య డి.మాధవి, కూతురు భార్గవి సుమారు 300 మంది విద్యార్థులకు పాఠశాలలో ప్లేట్లు అందజేశారు.

ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

కొడంగల్: కొడంగల్ ప్రాంత నిరుద్యోగుల కోసం ప్రభుత్వం కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం నాయకుడు పులిందర్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వచ్చే నోటిఫికేషన్స్ కోసం ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఘట్‌కేసర్ రూరల్: పాడిరైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారిని ఎం.పద్మిని తెలిపారు. ఎదులాబాద్‌లో గురువారం గాలికుంటు నివారణ (ఎఫ్‌ఎండీ) టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పశువైద్యాధికారి నరేందర్‌గౌడ్, పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

కులకచర్ల: తిరుమలాపూర్‌లో వనంల ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. శుక్రవారం వనంల ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పూడూరు: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని రాకంచర్ల ఎంవీఎస్ టెక్నాలజీస్ కంపెనీలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలు శామీర్‌పేట్, మేడ్చల్ పరిధిలో చోటుచేసుకున్నాయి. శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన రాంసింగ్(38) బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చి అలియాబాద్‌లోని ఇటుక బట్టీలో కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి భోజనం చేసి ఇటుక బట్టీకి వచ్చి కాల్చడానికి సిద్ధంగా ఉన్న ఒక ఇటుక బట్టీ పైన పడుకున్నాడు. తెల్లవారుజామున పనికి రావాల్సి ఉండగా రాకపోవడంతో తోటి వ్యక్తి గోవర్ధన్ రాంసింగ్‌కు ఫోన్‌చేయగా లిఫ్ట్‌చేయకపోవడంతో అనుమానం వచ్చి ఇటుకబట్టీ పైకి ఎక్కి చూడగా స్పృహ లేకుండా పడిఉన్నాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్యం వల్లనో, గుండెపోటు లేదా వడదెబ్బతో మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేడ్చల్ టౌన్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మేడ్చల్ పోస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని జైత్ర ఆసుపత్రిలో ఎలివేషన్ పని చేస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హన్ని (22) గురువారం ఆసుపత్రి పై అంతస్తు గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనబడ్డాడు. దీంతో ఆసుపత్రి నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమితం గాంధీ మార్చురీకి తరలించారు. ఆసుపత్రి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

బామ్మర్దుల హత్యకు కుట్ర

● బావ, సోదరి, నలుగురు నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సొంత బామ్మర్దుల హత్యకు కుట్రపన్నిన కేసులో బావ, సోదరితో పాటు మరో నలుగురు నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. అంకుశాపూర్‌కు చెందిన బోనాల పెంటయ్య కుమారులైన బోనాల రాజశేఖర్, బోనాల ఈశ్వర్‌ల హత్యకు కుట్ర పన్ని టోలిచౌకికి చెందిన ఎండీ ఇర్ఫాన్, షేక్ సాహిల్ బాబా, ఎండీ సల్మాన్‌తో పాటు మరో మైనర్ రెక్కీ నిర్వహిస్తుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా గచ్చిబౌలి, మసీద్‌బండకు చెందిన మేడ్చల్ శ్రీనివాస్ తమను బోనాల ఈశ్వర్‌కు ఇంటికి పంపించి రెక్కీ నిర్వహించాలని వారి ఇంటి లోకేషన్ షేర్ చేసి అతడి ఫొటో పంపాడని తెలిపారు. శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్న విచారించగా బోనాల రాజశేఖర్, ఈశ్వర్ స్వయాన తన భార్య లావణ్య సోదరులని వీరికి గతం నుంచి ఆస్తి తగదాలు ఉన్నాయి. ఇంతకుముందు తన బామ్మర్దులు ఈశ్వర్, రాజశేఖర్‌లు తమపై దాడి చేశారని, వారిపై పగతీర్చుకోవడానికే నలుగురు దుండగులతో దాడిచేయించాలనుకున్నానని శ్రీనివాస్ తెలిపారు. బామ్మర్దుల ఇంటికి దుండగులను పంపిన శ్రీనివాస్‌పై అతడి భార్య లావణ్య, ఇర్ఫాన్, సల్మాన్, సాహిల్‌ను గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించగా బాలున్ని జువైనల్ హోంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అఘోరిపై కేసు నమోదు


అఘోరిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జోగిని

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అఘోరిపై శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సనాతన ధర్మం పేరు చెప్పుకొని ప్రజలవద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి హిజ్రాలకు చెడ్డపేరు తెచ్చే విధంగా వ్యవహిస్తోందని జోగిని సంధ్య ఆరోపించారు. సనాతన ధర్మాన్ని కాపాడాలంటే ఇలాంటి వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

కులకచర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని అంతారంలో చోటుచేసుకుంది. తాటి ముంజలు విరివిగా కాయడంతో వాటిని కోసేందుకు గ్రామానికి చెందిన ఎక్కిన లక్ష్మయ్య ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. దీంతో అతడికి స్వల్పగాయాలు కావడంతో గమనించిన స్థానికులు వెంటనే లక్ష్మయ్యను అంబులెన్స్‌లో పరిగి ఆస్పత్రికి తరలించారు.

అల్మాస్కాన్‌పేట్ రైతులకు న్యాయం జరిగేనా?

కులకచర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకు వచ్చిన భూభారతితో తమకు న్యాయం చేకూరుతుందా? అని మండలంలోని అల్మాస్కాన్‌పేట్ రైతులు వేచిచూస్తున్నారు. అల్మాస్కాన్‌పేట్ పేరున్నా ఊరు లేదు. అయినప్పటికీ ఈ గ్రామం రెవెన్యూ గ్రామంగా రికార్డులో కొనసాగుతోంది. అల్మాస్కాన్‌పేట్ పరిధిలోని సర్వే నెం.1 నుంచి 86 వరకు 1056 ఎకరాల భూమి ఉంది. అందులో 113మంది రైతులు గత మూడు తరాలుగా కాస్తులో ఉన్నారు. గత ప్రభుత్వం ధరణి తీసుకురావడంతో కాస్తు కాలం నుంచి తొలగించబడ్డారు. బాధిత రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేయగా అధికారులతో సర్వే చేపట్టారు. అయితే సర్వే చేసి 5నెలలు గడుస్తున్నా పాసుపుస్తకాలు జారీ చేయలేదు. రాష్ట్ర సర్కార్ కొత్తగా భూభారతి పథకం తీసుకు రాగా ఈ పథకం తోనైనా తమకు న్యాయం జరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మురళీధర్‌ను వివరణ కోరగా భూముల సర్వే పూర్తయిందని, రైతుల వివరాల విచారణ కొనసాగుతుందని త్వరలోనే భూములు గుర్తించి పట్టాలు జారీ చేస్తామని తెలిపారు.

పాత విధానాన్నే కొనసాగించాలి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్లాట్‌బుకింగ్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్నే కొనసాగించాలని ఘట్‌కేసర్‌లో గురువారం డ్యాక్యుమెంట్ రైటర్లు తమ దుకాణాలను కొంతసేపు మూసివేసి నిరసన వ్యక్తంచేశారు. నూతన విధానంతో వేలాది మంది జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

దుద్యాల మండల వ్యవసాయ అధికారిగా నాగరాజు



దుద్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల నూతన వ్యవసాయ అధికారిగా సాదుల నాగరాజు నియమితులయ్యారు. నారాయణపేట ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఆయన దుద్యాలకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏవోగా విధులు నిర్వహిస్తున్న హిమబిందు రెగ్యులర్ స్థానమైన తాండూరుకు వెళ్లారు.